


14న చంద్రబాబు పర్యటన



విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఈనెల 14వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఉత్తరాంధ్రలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉమ్మడి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో రోజుకు మూడు సభల్లో ఆయన పాల్గొంటారు. 14వ తేదీన గాజువాక, చోడవరం, పాయకరావుపేటల్లో, 15న రాజాం, పలాస, టెక్కలి, 16న కురుపాం, గజపతినగరం, ఎస్.కోటల్లో ఎన్నికల సభల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.



కొత్తూరులోని శారదానగర్ ఇస్లాంపేట మదీనా మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

జిల్లాలో రంజాన్ పర్వదినాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు ఉదయాన్నే మసీదుకు వెళ్లి నమాజ్ చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ సందర్భంగా మసీదులు సందడిగా కనిపించాయి.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

స్థానిక కలెక్టరేట్‌లో సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ దయానిధి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- అనకాపల్లి కలెక్టరేట్



జ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



విద్యుత్ షాక్

జనంపై వైసీపీ సర్కారు బాదుడు

- ఐదేళ్ల క్రితంతో పోల్చితే బిల్లులు వంద నుంచి 200 శాతం పెరుగుదల
- పలుమార్లు చార్జీలు పెంపు
- ...ఇంకా ట్రూఅప్, తదితర పేర్లతో అదనపు భారం
- సాధారణ, మధ్య తరగతి ప్రజల గగ్గోలు
- వినియోగంలో మార్పు లేకపోయినా భారం పెరగడంపై ఆవేదన
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం



విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):

"గడిచిన పదేళ్లుగా మా ఇంట్లో మూడు లైట్లు, రెండు ఫ్యాన్లు, ఒక టీవీ ఉన్నాయి. రెండు లైట్లు, ఒక ఫ్యాన్ మాత్రమే ఎక్కువగా వాడుతుంటాం. కానీ గతానికీ, ఇప్పటికీ విద్యుత్ బిల్లులో మాత్రం భారీ తేడా కనిపిస్తోంది. ఐదేళ్ల కిందట రూ.160 నుంచి రూ.200 మధ్యలో బిల్లు వస్తే...ఇప్పుడు రూ.400 నుంచి రూ.500 మధ్యలో వస్తోంది. గత నెల అయితే రూ.580 వచ్చింది. ఐదేళ్లలో రెట్టింపునకు మించి విద్యుత్ బిల్లు పెరిగిపోవడం దారుణం"

...ఇదీ విశాఖలోని మద్దిలపాలెంలో ఉంటున్న ప్రైవేటు ఉద్యోగి రామకృష్ణ ఆవేదన.

"కరెంట్ బిల్లు గతంలో రూ.250 వచ్చేది. గడిచిన కొన్నాళ్ల నుంచి రూ.400 నుంచి రూ.500 మధ్యలో వస్తోంది. రెట్టింపు అయ్యింది. విద్యుత్ చార్జీలతో ఇంట్లో ఫ్యాన్ వేయడానికి కూడా భయమేస్తోంది. నెలవారీ ఖర్చుల్లో కరెంట్ బిల్లుకు ఇంత మొత్తం చెల్లించాల్సి రావడం గతంలో ఎప్పుడూ లేదు."

- విశాఖ విశాలాక్షి నగర్‌లో నివాసం ఉంటున్న సత్యవతి

...రామకృష్ణ, సత్యవతి మాత్రమే కాదు. సాధారణ, మధ్య తరగతి ప్రజలంతా విద్యుత్ బిల్లుల భారంపై ఆందోళనతో ఉన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదేళ్లలో విద్యుత్ బిల్లులు వంద నుంచి 200 శాతం వరకూ పెరిగిపోయాయి. ఇంట్లో వినియోగించే విద్యుత్ ఉపకరణాల్లో తేడా లేకపోయినప్పటికీ బిల్లులు మాత్రం భారీగా పెరిగిపోవడం పట్ల వినియోగదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పలుమార్లు విద్యుత్ చార్జీలను పెంచింది. ఇంకా ట్రూఅప్, తదితర పేర్లతో అదనపు భారాన్ని మోపింది. గతంలో విద్యుత్ బిల్లు రూ.300 వచ్చిన వినియోగదారులకు ఇప్పుడు రూ.600, అంతకంటే ఎక్కువ వస్తోంది. సాధారణ, మధ్య తరగతి ప్రజలు విద్యుత్ బిల్లుకు బడ్జెట్‌లో రూ.300కు మించి పెట్టేందుకు ఇష్టపడరు. అందుకు అనుగుణంగానే వినియోగం ఉండేలా చూసుకుంటారు. అయితే వినియోగం విషయంలో జాగ్రత్తలు పాటిస్తున్నా, కొన్నిసార్లు తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నా బిల్లులు మాత్రం తగ్గడం లేదని విశాఖలోని వెంకోజీపాలెంలో నివాసం ఉంటున్న ఆర్.స్వప్న అనే గృహిణి ఆవేదన వ్యక్తంచేశారు. ఫ్యాన్లు వినియోగాన్ని చాలావరకు తగ్గిస్తున్నామని, అయినా బిల్లు మాత్రం తగ్గడం లేదన్నారు. నెలవారీ పెరుగుతున్న విద్యుత్ బిల్లులు చూస్తుంటే ఫ్యాన్ వేసుకోవడానికి భయమేస్తోందని విశాఖ అక్కయ్యపాలేనికి చెందిన సుగుణ అనే గృహిణి వాపోయారు. గతంలో నెలకు రూ.250 బిల్లు వస్తే...ఇప్పుడు రూ.480 వరకు వస్తోందని, ఒక్కోసారి రూ.500 దాటిపోతోందని ఆమె ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విద్యుత్ వినియోగాన్ని తగ్గిస్తున్నా యూనిట్లు మాత్రం తగ్గడం లేదని, దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సిబ్బంది పట్టించుకోవడం లేదని మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేసే పైడినాయుడు ఆరోపించారు. ప్రజలపై భారం మోపే ముందు ప్రభుత్వాలు ఆలోచన చేయాలని, ఇతర ఖర్చులను విద్యుత్ చార్జీల రూపంలో సమకూర్చుకునేందుకు యత్నించడం వల్లే ... మిగతా 8వ పేజీలో

ఆర్థిక భారం పెరిగింది



విద్యుత్ చార్జీలు పెరగడం వల్ల ఆర్థిక భారం అధికమవుతోంది. గతంలో నెలకు రూ.400 లు వచ్చే విద్యుత్ బిల్లు ప్రస్తుతం రూ.600లు నుంచి రూ. 700లు వరకు వస్తుంది. ఈ వేసవిలో విద్యుత్ వాడకం వల్ల బిల్లులు మరింత పెరిగే అవకాశముందని ఆందోళనగా ఉంది. విద్యుత్ చార్జీలు తరచూ పెంచడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. - **గొర్ల పేర్రాజు,** వేల్పులవీధి, అనకాపల్లి

కరెంటు బిల్లులు అడ్డగోలుగా పెరిగాయి



ఐదేళ్లలో కరెంటు చార్జీలు చాలా ఎక్కువగా పెరిగాయి. మా ఇంట్లో టీవీ, ఫ్రిజ్, రెండు ఫ్యాన్లుకు కలిపి ఐదేళ్ల క్రితం నెలకు రూ.270 కరెంటు బిల్లు వచ్చేది. అదే టీవీ, ఫ్రిజ్, రెండు ఫ్యాన్లకు ఇప్పుడు రూ.800 నుంచి రూ.900 పైబడి కరెంటు బిల్లు వస్తున్నది. ఒక్కోసారి కరెంటు బిల్లు వెయ్యి రూపాయలు కూడా దాటి వస్తున్నది. - **మైచర్ల నీలవేణి,** గృహిణి, దుడ్డువీధి, చోడవరం

అదనపు చార్జీల మోత



ఐదేళ్ల క్రితం కంటే ఇప్పుడు విద్యుత్ బిల్లులు బాగా పెరిగాయి. వినియోగదారుడికి అర్థంకాని అదనపు చార్జీలు వడ్డిస్తున్నారు. ప్రతి నెలా విద్యుత్ చార్జీలు పెరుగుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. యూనిట్ చార్జీలకు అదనంగా ట్రూ అప్, ఎఫ్‌పీపీసీఏ, ఎఫ్‌పీపీసీఏ-2 చార్జీ వేస్తున్నారు. గతంలో మార్చి నెలలో రూ.1500 కరెంటు బిల్లు వస్తే, ఇప్పుడు రూ.3,600 బిల్లు వచ్చింది. పెరిగిన నిత్యావసర ధరలకు తోడు విద్యుత్ బిల్లు వల్ల భారం పడుతోంది. - **వి.గౌరీ శంకర్ రెడ్డి,** నర్సీపట్నం



లారీ ముందు చక్రాల కింద ఉన్న బైక్

మృత్యు శకటం

అచ్యుతాపురంలో రోడ్డు ప్రమాదం

- బైక్‌ను ఢీకొన్న లారీ
- ముగ్గురి మృతి

అచ్యుతాపురం, ఏప్రిల్ 11: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో గురువారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. ప్రమాదానికి సంబంధించి సీఐ బుచ్చిరాజుతో పాటు స్థానికులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. దుప్పితూరుకు చెందిన గొల్లపల్లి శేఖర్ (19), నర్మాల అమల (38), కశింకోట మండలం ఉగ్గినపాలేనికి చెందిన డి.జ్యోతిప్రకాష్ (14)లు మధ్యాహ్నం సుమారు 11.30 గంటలకు బైక్‌పై ఎలమంచిలి వైపు వెళుతున్నారు. అచ్యుతాపురం జంక్షన్ సమీపంలో వీరి వాహనాన్ని వెనుక నుంచి ఫ్లైయాష్ లోడ్‌తో వస్తున్న లారీ ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురు లారీ వెనుక చక్రాల కింద నలిగి మృతిచెందారు. చుట్టుపక్కల వాళ్లు శేఖర్, అమలను దుప్పితూరు వాసులుగా గుర్తుపట్టి బంధువులకు సమాచారం అందించారు. అయితే జ్యోతిప్రకాష్ తల ఛిద్రం అవడంతో ఎవరూ పోల్చుకోలేకపోయారు. శేఖర్ స్నేహితులు దుస్తులను బట్టి జ్యోతిప్రకాశ్‌గా గుర్తుపట్టారు. ఉగ్గినపాలేనికి చెందిన ప్రకాష్ పూడిమడక రోడ్డులో గల ఒక నర్సరీలో పనిచేస్తున్నాడని తెలిసింది. ప్రమాదానికి కారణమైన లారీ పరవాడ వద్ద గల ఎన్‌టీపీసీ నుంచి ఫ్లైయాష్‌ను రాజమండ్రి తీసుకువెళుతోంది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ శివ పరారైపోయాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బుచ్చిరాజు తెలిపారు.



నర్మాల అమల (ఫైల్)



గొల్లపల్లి శేఖర్ (ఫైల్)



జ్యోతి ప్రకాశ్ (ఫైల్)

బాబా ఆలయానికి వెళుతూ...

దుప్పితూరుకు చెందిన అమలకు ఇద్దరు కుమార్తెలు. అమల భర్త చనిపోవడంతో అచ్యుతాపురం-పూడిమడక రోడ్డులో జ్యూస్ షాపు పెట్టుకొని వచ్చిన ఆదాయంతో జీవిస్తోంది. ఆమె ఎలమంచిలి రోడ్డులో గల సాయిబాబా గుడికి ప్రతి గురువారం హారతికి వెళుతుంటుంది. అదే విధంగా గురువారం మధ్యాహ్నం 11.30 గంటల ప్రాంతంలో ఆమె గ్రామానికే చెందిన శేఖర్ తన స్నేహితుడు జ్యోతిప్రకాశ్‌తో వెళ్లి అమల షాపు వద్ద జ్యూస్ తాగారు. హారతికి సమయం అవుతోందని, తనను సాయిబాబా ఆలయం వద్ద దింపాల్సిందిగా అమల కోరింది. ఆమెను తీసుకుని వెళుతుండగా, గుడి మరో 500 మీటర్ల దూరంలో ఉందనగా ప్రమాదం జరిగింది.

గంటపాటు నరకం చూసిన అమల

ప్రమాదంలో శేఖర్, జ్యోతిప్రకాష్ అక్కడికక్కడే మరణించగా, అమల మాత్రం ప్రాణాలతో డంపర్ వెనుక చక్రాల కింద ఉండిపోయింది. అయితే రెండు చేతులు తెగిపోయాయి. లారీ టైర్ కాళ్లమీదకు ఎక్కడంతో శరీరం అంతా ఛిద్రమైపోయింది. రక్షించండి, రక్షించండి అని కేకలు వేసింది. అయినా ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి. ఆమె సుమారు 40 టన్నుల లోడుతో ఉన్న డంపర్ వెనుక టైరు కింద చిక్కుకుపోయింది. దగ్గరలో భారీ క్రేన్‌లు కూడా లేవు. ఆమె ఆ బాధతో అలాగే సుమారు 12.30 గంటల ప్రాంతంలో ప్రాణాలు విడిచింది.

రోడ్డుపై బైఠాయించిన బంధువులు

మృతుల కుటుంబీకులకు న్యాయం చేయాలంటూ ... మిగతా 8వ పేజీలో

నీరుగారిన లక్ష్యం!

అగనంపూడి నుంచి అనకాపల్లికి పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరాకు ప్రతిపాదనలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి పట్టణ ప్రజల నీటి కష్టాలు ఇప్పట్లో తీరే దారి కనిపించడం లేదు. లక్ష్మీదేవిపేట, గవరపాలెంలో 10 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం గల స్టోరేజీ ట్యాంకర్ల నిర్మాణానికి ప్రభుత్వ ఆమోదం లభించినా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలన్న లక్ష్యం నీరుగారుతోంది.

- టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభం
- వైసీపీ అధికారంలోకి వచ్చాక బ్రేక్
- ఎట్టకేలకు 2019 ఆగస్టులో పైపులైన్ పనులకు సీఎం జగన్ శంకుస్థాపన
- నత్తనడకన సాగుతున్న పనులు
- ఇంకా ప్రారంభంకాని స్టోరేజి ట్యాంకుల నిర్మాణం
- అనకాపల్లి పట్టణ ప్రజలకు తప్పని తాగునీటి కష్టాలు



కేఎన్ఆర్ పేటలో రోడ్డు పక్కన ఉంచిన పైపులు

అగనంపూడి రక్షిత నీటి పథకం ట్యాంకు నుంచి అనకాపల్లి ప్రజలకు సురక్షిత నీరు అందించే లక్ష్యంతో 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం అమృత పథకం కింద పనులు ప్రారంభించింది. అయితే కేవలం 25 శాతం లోపే పనులు పూర్తయిన కారణంగా 2019 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులను రద్దు చేసింది. తరువాత ఇదే సంవత్సరంలో జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు అగనంపూడి నుంచి అనకాపల్లికి పైపులైను వేసేందుకు జీవీఎంసీ జనరల్ ఫండ్స్, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.32 కోట్లు కేటాయించి పనులు చేపట్టాలని నిర్ణయించారు. అగనంపూడి నుంచి అనకాపల్లి వరకు భూగర్భ పైపులైన్ అమరిక పనులు చేపట్టడం ద్వారా అనకాపల్లి పట్టణ జీవీఎంసీ పరిధిలో నీటి నిల్వ ట్యాంకులు నిర్మించి ప్రజలకు తాగునీరు అందించాలన్నది ఉద్దేశం. 2019 ఆగస్టు నెలలో సీఎం జగన్మోహన్‌రెడ్డి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. కొద్దికాలం పాటు పనులు జరిగాక 2020లో కరోనా ఉధృతి కారణంగా పైపులైను నిర్మాణ పనులు ఏడాది కాలం పాటు నిలిపివేశారు. తరువాత 2021లో మళ్లీ జీవీఎంసీ ఇంజనీర్లు పనులు ప్రారంభించినా నిర్మాణ పనులు మాత్రం వేగం పుంజుకోలేదు. అగనంపూడి నుంచి అనకాపల్లి వరకు 17 కిలోమీటర్ల పొడవున భూగర్భ పైపులైన్‌ల అమరిక పనులు పూర్తిచేసి, తుమ్మపాలలో ఉన్న జీవీఎంసీ రక్షిత నీటి ట్యాంకుకు అనుసంధానం చేయాల్సి ఉండగా, ఐదేళ్లుగా పైపులైన పనులు కేవలం 12 కిలోమీటర్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 5 కిలోమీటర్లు పొడవున పైపుల అమరిక పనులు కొనసాగుతూనే ఉన్నాయి. పనులు ముందుకు సాగకపోవడానికి కారణం జాతీయ రహదారి విభాగం అధికారులు, మరోవైపు రైల్వే శాఖ నుంచి పైపులైన్ పనులకు అనుమతులు తొందరగా రాకపోవడమేనని జీవీఎంసీ అధికారులు చెప్పుకొస్తున్నారు. ఇటీవల రెండు శాఖల నుంచి అనుమతులు వచ్చాయని, ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయని చెబుతున్నారు. డిసెంబరు ... మిగతా 8వ పేజీలో



అనకాపల్లి భీముడుగుమ్మం పరిసరాల్లో రోడ్డు పక్కన పైపులైన్ పనుల కోసం తవ్విన గొయ్యి

నకిలీ బంగారంతో టోకరా

పట్నంలోని ఒక బంగారం షాపులో ఘటన

- 40 గ్రాముల బంగారం గొలుసుకి అప్పు కావాలని అడిగిన యువతి
- గీటు పెట్టి ఒరిజినల్ బంగారంగా గుర్తించి రూ.1.6 లక్షలు ఇచ్చిన యజమాని
- యువతి వెళ్లిన తరువాత ఒరిజినల్ బంగారం కాదని తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు



సీసీ ఫుటేజీలో అనుమానితురాలు

నర్సీపట్నం, ఏప్రిల్ 11: పట్నంలోని ఒక బంగారం దుకాణంలో ఓ యువతి నకిలీ బంగారం గొలుసుతో రూ.1.6 లక్షలకు టోకరా వేసింది. బాధితుడి బంధువులు గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సీపట్నం కృష్ణాబజార్ రోడ్డులోని ఒక బంగారం షాపు వద్దకు బుధవారం ఒక యువతి, వృద్ధుడు, వృద్ధురాలు వచ్చారు. బంగారం షాపు యజమాని సురవన్నె లక్ష్మణరావును 40 గ్రాముల బంగారం గొలుసు మీద అప్పు కావాలని యువతి అడిగింది. శారదానగర్ రెండో లైన్‌లో నివాసం ఉంటానని చెప్పింది. లక్ష్మణరావు గొలుసు గీటు పెట్టి ఒరిజినల్ బంగారంగా నిర్ధారించుకున్నారు. రుణం ఇచ్చే ముందు అడ్రస్ ప్రూఫ్ అడిగారు. యువతి తనతో పాటు తీసుకొచ్చిన వృద్ధుడి ఆధార్ జెరాక్స్ ఇచ్చింది. అందులో అల్లుగూడ కన్నడ స్వామి, విజయవాడ చిరునామాతో ఉంది. ఆధార్ జెరాక్స్ మీద సెల్‌ఫోన్ నంబరు 81259 92934 రాసి ఇచ్చింది. దీంతో బంగారం షాపు యజమాని లక్ష్మణరావు బంగారం గొలుసు మీద రూ.1.6 లక్షలు అప్పుగా యువతికి ఇచ్చారు. యువతి వెళ్లిపోయిన తరువాత బంగారం గీటు పెట్టి మరోసారి తనిఖీ చేసి షాక్‌కి గురయ్యారు. గొలుసు రోల్డ్ గోల్డ్ బంగారంతో చేసిందని గుర్తించి నిర్ఘాంతపోయారు. షాపులోని సీసీ పుటేజి చూసి జరిగిన మోసాన్ని గుర్తించి బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

267 కిలోల గంజాయి స్వాధీనం



- నలుగురి అరెస్టు

పట్టుబడిన గంజాయి నిందితులతో రూరల్ సీఐ, సిబ్బంది

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 11: మండలంలోని గబ్బాడ సమీపంలో 267 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేశామని రూరల్ సీఐ బి.హరి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు నెల్లిమెట్ట జంక్షన్ వద్ద తనిఖీలు చేపడుతుండగా ఒక ఆటోలో ముగ్గురు వ్యక్తులు గంజాయి లోడ్‌తో వస్తూ పట్టుబడ్డారన్నారు. వారికి మోటారు సైకిల్‌పై పైలట్‌గా వస్తున్న మరో వ్యక్తి పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకుని విచారించామన్నారు. దీంతో కొనుగోలు చేసిన గంజాయిని చింతపల్లి నుంచి తునికి చెందిన రమణకు అప్పగించడానికి తీసుకుని వెళుతున్నట్టు వెల్లడించారన్నారు. 267 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒక మోటారు బైకు, ఏడు సెల్‌ఫోన్లు సీజ్ చేశామన్నారు. ఇందుకు సంబంధించి నక్కపల్లి మండలం ఉద్దండపురానికి చెందిన బొండాడ కోదండరాముడు, కాకినాడ జిల్లా తుని పట్టణానికి చెందిన పబ్బినీడు అమ్మిరాజు, గొలుగొండ మండలం కోదులపాలేనికి చెందిన రెడ్డి నరసింహమూర్తి, తునికి చెందిన ఆకుల శ్రీనులను అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

క్రైం... crime news

15 కిలోల గంజాయి స్వాధీనం


పట్టుపడ్డ గంజాయితో సీఐ అప్పలనాయుడు తదితరులు

రావికమతం, ఏప్రిల్ 11: బైక్‌పై తరలిస్తున్న 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను అందించారు. రావికమతం ఎస్ఐ ధనుంజయనాయుడు గురువారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నంద్యాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై గంజాయితో వస్తూ పట్టుబడ్డారన్నారు. వీరు ఒడిశా సరిహద్దుల్లో గంజాయి కొనుగోలు చేసి నంద్యాలకు తరలిస్తున్నట్టు తమ విచారణలో తేలిందన్నారు. వీరిద్దరిపై కేసు నమోదు నమోదుచేసినట్టు చెప్పారు.

700 లీటర్ల బెల్లపు పులుసు ధ్వంసం


గొంపలో పట్టుకున్న బెల్లం పులుసుతో పోలీసులు

రావికమతం, ఏప్రిల్ 11: గొంప గ్రామ శివారులో సారా తయారీకి నిల్వచేసిన 700లీటర్ల బెల్లపు పులుసును ధ్వంసం చేసినట్టు స్థానిక ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపారు. గురువారం సిబ్బందితో కలసి తనిఖీలు చేపట్టగా గొంప శివారులో ప్లాస్టిక్ డ్రమ్‌లతో ఉన్న ఈ బెల్లం పులుసును గుర్తించి ధ్వంసం చేశామన్నారు. తమ రాకను పసిగట్టిన నిందితులు పరారైనట్టు చెప్పారు.

పురుగుల మందు తాగి గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఎలమంచిలి, ఏప్రిల్ 11: ఎలమంచిలి రైల్వేస్టేషన్‌లో ఈనెల 7వ తేదీన పురుగుల మందు తాగిన గుర్తు తెలియని వ్యక్తి అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు తుని రైల్వే పోలీస్ ఇన్‌చార్జ్ ఎస్ఐ లోవరాజు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి.

ఎలమంచిలి రైల్వేస్టేషన్‌లో ఈనెల 7వ తేదీన సుమారు 35 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి పురుగులు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో స్థానిక సీహెచ్‌సీకి పోలీసులు తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు ఆస్పత్రి వైద్యులు ధ్రువీకరించినట్టు ఎస్ఐ లోవరాజు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలియరాలేదని, బూడిద రంగు ప్యాంటు, బూడిద రంగు చొక్కా ధరించి ఉన్నాడని ఆయన తెలిపారు. మృతదేహం అనకాపల్లి ఆస్పత్రి మార్చురీలో భద్రపరచడం జరిగిందని, మృతుడి వివరాలు తెలిసినట్టయితే తుని రైల్వే పోలీసులకు తెలియపరచాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చోద్యంలో 20 మద్యం సీసాలు స్వాధీనం

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 11: చోద్యం గ్రామంలోని బెల్టు దుకాణంలో విక్రయించేందుకు తరలిస్తున్న 20 మద్యం సీసాలను గురువారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. అదే గ్రామానికి చెందిన శ్రీరామమూర్తి కృష్ణాదేవిపేట నుంచి చోద్యం గ్రామానికి మద్యం తీసుకువెళ్తూ ఏఎల్ పురం బంక్ వద్ద పట్టుబడ్డాడన్నారు. అతని నుంచి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కాపు సామాజిక భవనం పూర్తయ్యేదెన్నడో..

టీడీపీ హయాంలో గణపతినగర్ వద్ద పనులు ప్రారంభం

- ఐదేళ్లు పూర్తి కావస్తున్నా పునాదులు దాటని వైనం
- రూ.18 లక్షలు ఖర్చు చేసిన కాంట్రాక్టర్
- ఇంతవరకు రూపాయి కూడా చెల్లించని వైనం
- వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టించుకోని నేతలు


శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న నాటి ఎమ్మెల్యే బండారు, అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు


పునాదుల స్థాయిలోనే నిలిచిపోయిన కాపు సామాజిక భవన నిర్మాణం

సబ్బవరం, ఏప్రిల్ 11:

మండలంలోని ఇరువాడ శివారు గణపతినగర్ వద్ద టీడీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కాపు సామాజిక భవన నిర్మాణ పనులు పునాదుల దశలోనే నిలిచిపోయాయి. భవన నిర్మాణ పనులు ప్రారంభించి ఐదేళ్లు దాటుతుండడంతో కాలమ్ రాడ్లు తుప్పు పట్టిపోతున్నాయి. సైటు చదును చేసేందుకు, సామాజిక భవనం నిర్మాణ పనులకు ఖర్చు చేసిన రూ.18 లక్షలు బిల్లు కూడా నేటికీ వైసీపీ ప్రభుత్వం చెల్లించలేదు. అయితే కాపు సామాజిక భవనం నిర్మాణ పనులు తిరిగి ప్రారంభిస్తామని వైసీపీ నేతలు రెండేళ్లు క్రితం హడావిడి చేశారే తప్ప కార్యరూపం దాల్చలేదు.

మండలంలో కాపు సామాజిక భవనం నిర్మించాలని ఆ సామాజిక నేతలు కోరడంతో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కాపు కార్పొరేషన్ నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. ఇరువాడ శివారు గణపతినగర్ వద్ద సర్వే నంబరు 174 కొండవాలు ప్రాంతంలో అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారికి ఆనుకొని రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించారు. 2018 డిసెంబరు 3 అప్పటి అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో కలసి కాపు సామాజిక భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అప్పటి ఎంపీ ముత్తంశెట్టి సామాజిక భవనం పైఅంతస్తు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. అలాగే ఆర్చితోపాటు పార్కు ఏర్పాటుకు మరో రూ.10 లక్షలు తన ఎంపీ నిధులు నుంచి మంజూరు చేస్తానని సభలో ప్రకటించారు. కాంట్రాక్టర్ కుచ్చర్లపాటి రామకృష్ణరాజు భవన నిర్మాణ పనులు చేపట్టారు. కొండవాలు ప్రాంతం చదును చేసి, కాలమ్స్ వరకూ పనులు చేశారు. సుమారు రూ.18 లక్షలు ఖర్చు చేశారు. అనంతరం ప్రభుత్వం మారడంతో తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కాపు సామాజిక భవనం పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

కాగా రెండేళ్ల క్రితం వైసీపీ నేతలు కాపు సామాజిక భవనం అంశం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. జడ్పీ నుంచి రూ.10 లక్షలు, మండల పరిషత్తు నుంచి రూ.10 లక్షలు సమకూరుస్తామని, అయితే నిర్మాణ పనులు పంచాయతీరాజ్‌కు అప్పగించాలని భవన నిర్మాణం పనులు చేపట్టిన ఏపీఈడబ్ల్యూఐడీసీ సంస్థకు షరతు పెట్టారు. పాత కాంట్రాక్టర్ ఖర్చు చేసిన రూ.18 లక్షలు చెల్లించిన తరువాత డిపార్టుమెంట్ మార్చుకోమని ఆ సంస్థ తేల్చి చెప్పింది. పాత నిధులు చెల్లించలేదు.. డిపార్టుమెంట్ మార్చడం జరగలేదు. ఈలోగా వైసీపీ ప్రభుత్వ కాలం గడిచిపోయింది. ఇదిలా ఉండగా కావాలనే కాపు సంక్షేమ భవన నిర్మాణం పూర్తికాకుండా కొంతమంది నేతలు అడ్డుకున్నారని టీడీపీ కాపు సామాజికవర్గం నేతలు ఆరోపిస్తున్నారు. మండలంలో వైసీపీ ప్రభుత్వం కాపులకు చేసిందేమీ లేదని, ఆ సామాజికవర్గానికి చెందిన టీడీపీ నేతలు ఆరోపణలు గుప్పిస్తున్నారు.

అనకాపల్లిలో అధ్వానంగా డ్రైనేజీలు

- కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం
- దుర్వాసనతో జనం ఉక్కిరిబిక్కిరి
- దోమల ఆవాస కేంద్రాలుగా కాలువలు
- మురికి నీరు ఔట్ లెట్ లేక ఈ దుస్థితి


చెత్తా చెదారంతో పేరుకుపోయిన రింగురోడ్డులో కాలువ


నాయుళ్లవీధిలో కాలువలో పేరుకుపోయిన చెత్త

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 11 : జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో డ్రైనేజీలు అధ్వానంగా మారాయి. ఏ డ్రైన్‌ను పరిశీలించిన చెత్తా చెదారం దర్శనమిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. అనకాపల్లి మున్సిపాలిటీగా ఉన్నప్పటి నుంచి పట్టణంలోని మురికి నీరంతా బయటకు పోవడానికి ఔట్‌లెట్ సౌకర్యం లేకపోవడంతో పట్టణ నడిబొడ్డున ఉన్న పంట కాలువలే ఆధారంగా మారాయి. మున్సిపాలిటీ జీవీఎంసీలో విలీనమై పదేళ్లు గడిచినా ఔట్‌లెట్ సౌకర్యం ఏర్పాటుపై ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో పలు సందర్భాల్లో కాలువల్లో ప్రవహించాల్సిన మురుగునీరు రోడ్లపైకి చేరిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారులైన రింగురోడ్డు, గాంధీమార్కెట్‌రోడ్డు, ఎన్టీఆర్ వైద్యాలయం రోడ్డు, నాయుళ్లవీధి రోడ్డుతోపాటు పూడిమడకకు వెళ్లే రోడ్డు, అరటిపండ్ల మార్కెట్‌రోడ్డు, రింగురోడ్డుకు వెళ్లే జంక్షన్ తదితర ప్రాంతాల్లో కాలువలు చెత్తకుప్పలమయమయ్యాయి. ఇటీవల ప్రధాన కాలువల్లో పూడికలు తీయించినా అంతంతమాత్రంగానే తీయించారనే విమర్శలు కూడా ఉన్నాయి. కోట్ల రూపాయలతో ఇటు కాలువల్లోను, అటు పంట కాలువల్లోను జీవీఎంసీ అధికారులు పూడికలు తీయించినా పరిస్థితిలో ఎటువంటి మార్పు కనిపించడం లేదు. అనకాపల్లి మున్సిపాలిటీగా ఉన్నప్పుడు పారిశుధ్య కార్మికులు 270 మందికి పైగా పనిచేసేవారు. అప్పటికీ ఇప్పటికీ పట్టణ విస్తీర్ణం పెరగడంతోపాటు జనాభా కూడా పెరిగింది. అయితే ప్రస్తుతం పట్టణంలో కేవలం 200 మంది వరకు మాత్రమే కార్మికులు నిత్యం విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో 100 మంది వరకు పర్మినెంట్ కార్మికులు కాగా మిగిలిన 100 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నారు. పనిభారం పెరిగినా అందుకు తగ్గట్టుగా కార్మికుల సంఖ్య పెంచడం లేదని పారిశుధ్య కార్మిక సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. సిబ్బంది తక్కువ కావడం వల్లే పనులు జరగడం లేదని అంటున్నారు. కాలువలు అధ్వానంగా మారడంతో దుర్వాసన వస్తున్నది. ముఖ్యంగా కాలువకు ఆనుకుని ఉన్న వ్యాపారులు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారంపై బ్లీచింగ్ పౌడరు గాని, ఫినాయిల్ గాని పిచికారీ చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. కూరగాయలు, కొబ్బరికాయల మార్కెట్‌లకు వచ్చే రైతులతోపాటు కొనుగోలుదారులు కూడా ఈ దుర్వాసనకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేసి కాలువల్లోని నీరు సజావుగా పారేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడును వివరణ కోరగా.. ఇప్పటికే పారిశుధ్య విభాగం అధికారులకు కాలువల పరిశుభ్రతపై ఆదేశించామన్నారు. మరోసారి మీటింగ్ పెట్టి డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరుస్తామని, ఇప్పటికే పలుచోట్ల మెరుగుపరిచామని చెప్పారు.

మాడుగుల టీడీపీ నేత గవిరెడ్డి కన్నీటి పర్యంతం

- ఈ ఒక్కసారి నాకు టికెట్ ఇవ్వండంటూ వేడుకోలు


సమావేశంలో కన్నీటి పర్యంతమవుతున్న రామానాయుడు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 11: గత ఎన్నికల్లో ఓడిపోయినా పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలూ శ్రమించానని, అధిష్ఠానం కార్యకర్తలు, ప్రజల మనోభావాలు తెలుసుకుని తనకు టికెట్ కేటాయించాలని మాడుగుల నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత గవిరెడ్డి రామానాయుడు కోరారు. గురువారం జంపెన శివాలయం వద్ద ఆయన, ఆయన సోదరుడు సన్యాసినాయుడు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గవిరెడ్డి మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం సూచించిన కార్యక్రమాలు తూచా తప్పకుండా నిర్వహించానని, ఇన్‌చార్జి పదవి నుంచి తొలగించినా కేడర్‌కు అండగా నిలబడ్డానన్నారు. అధిష్ఠానం ఈ ఒక్కసారి తనకు టికెట్ ఇవ్వాలని కోరుతూ కన్నీటి పర్యంతమయ్యారు. మాడుగుల టికెట్‌పై అధిష్ఠానం పునరాలోచన చేయాలని నాయకులు, కార్యకర్తలు కోరారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

టీడీపీ అరకులోయ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర


అరకులోయలో విలేకరులతో మాట్లాడుతున్న సియ్యారి దొన్నుదొర

అరకులోయ, ఏప్రిల్ 11: అభిమానులు, శ్రేయోభిలాషుల అభీష్టం మేరకు త్వరలో జరగనున్న ఎన్నికల్లో అరకులోయ అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న సియ్యారి దొన్నుదొర ప్రకటించారు. గురువారం సాయంత్రం అరకులోయలోని తన నివాసంలో మద్దతుదారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వేలాది మంది ప్రజల సమక్షంలో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు అరకు అభ్యర్థిగా తన పేరును ప్రకటించారన్నారు. అనంతరం విడుదల చేసిన తొలి జాబితాలో కూడా తన పేరు ఉందన్నారు. దాంతో ఒక దఫా ప్రచారం కూడా పూర్తిచేశామన్నారు. ఇటువంటి పరిస్థితితో బీజేపీ పొత్తుధర్మాన్ని మరచి ఏ విధంగా తనను తప్పించి వారి అభ్యర్థిని ప్రకటించిందని దొన్నుదొర ప్రశ్నించారు. అనంతరం పార్టీ అధినేత చంద్రబాబునాయుడును కలిస్తే పొత్తులో భాగంగా అరకు సీటు కావాలని బీజేపీ అధిష్ఠానం పట్టుబట్టిందని, ఎన్నికల అనంతరం వంద రోజుల్లో ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడితే బహిరంగంగా ప్రకటించిన సీటునే బీజేపీకి కట్టబెట్టినప్పుడు, నాలుగు గోడల మధ్య ఇచ్చిన హామీని ఎలా నమ్మగలమనడంతో వారి అభిప్రాయం, నిర్ణయం మేరకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో పెదబయలు మాజీ ఎంపీపీ కొండయ్య, లక్ష్మీపేట, పెదలబుడు సర్పంచులు అశోక్, పెట్టెలి దాసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో 30 వేల టన్నుల ఇసుక నిల్వలు


ఇసుకను తీసుకెళ్లడానికి వచ్చిన ట్రాక్టర్లు, లారీలు

నక్కపల్లి, ఏప్రిల్ 11: స్థానిక ఇసుక డిపో వద్ద దాదాపు 30వేల టన్నుల ఇసుక నిల్వలు అందుబాటులో వున్నాయి. గత పక్షం రోజుల్లో వందలాది లారీలతో కాంట్రాక్ట్ సంస్థ గోదావరి ఇసుకను రాజమహేంద్రవరం నుంచి తీసుకువచ్చింది. గతంలో టన్ను ఇసుక ధర రూ.1400 వుండగా, ప్రస్తుతం రూ 200 తగ్గించి, టన్ను ఇసుక రూ.1200లకే ఇస్తున్నారు. ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాలకు చెందిన అనేక మంది డిపో నుంచి ఇసుక కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. రోజుకు సగటున 300 నుంచి 400 టన్నుల ఇసుక అమ్మకాలు జరుగుతున్నాయి.

సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే

- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్


నెహ్రూచౌక్‌లో జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీఎం రమేశ్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిరావు పూలే సంఘ సంస్కర్తగా నాటి సమాజంలో అసమానతలను పారదోలడానికి ఎనలేని కృషి చేసిన మహనీయుడని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అని అన్నారు. గురువారం నెహ్రూచౌక్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ మాట్లాడుతూ చిన్నతనంలో జ్యోతిరావు పూలే అనుభవించిన అంటరానితనం, మనుషుల మధ్య అంతరాలు, మూఢ నమ్మకాలు వంటి దురాచారాలను అంతం చేయడానికి కృషి చేసి మహాత్మా బిరుదుతో మహాత్మా జ్యోతిరావు పూలేగా వినుతికెక్కారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జనసేన అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 11: జిల్లాలో ముస్లింల కుటుంబసభ్యులకు గురువారం ఎస్పీ కేవీ మురళీకృష్ణ రంజాన్ శుభాకాంక్షలను ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ పండగ అందరి మంచిని కోరుకుంటూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

20న 'పేట'లో జగన్ రోడ్డు షో

పాయకరావుపేట, ఏప్రిల్ 11: ఈనెల 20న పాయకరావుపేటలో సీఎం జగన్ రోడ్డు షో ఉంటుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డే ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ ఉదయం కాకినాడ జిల్లా తుని నుంచి పాయకరావుపేటకు సీఎం జగన్ బస్సు యాత్ర వస్తుందన్నారు. పట్టణంలో తాండవ వంతెన నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా వై జంక్షన్ వరకు సీఎం జగన్ ప్రజలకు అభివాదం చేసుకుంటూ రోడ్డు షో నిర్వహిస్తారన్నారు. నక్కపల్లి, అడ్డురోడ్డు జంక్షన్, ఎలమంచిలిల్లో రోడ్డు షో ఉంటుందన్నారు. అక్కడి నుంచి బస్సు యాత్ర అనకాపల్లి చేరుకుంటుందన్నారు. పట్టణంలో మూడు కిలోమీటర్ల మేర సీఎం జగన్ రోడ్డు షో నిర్వహిస్తారని, అనంతరం సాయంత్రం 3 గంటలకు చోడవరంలో జరిగే బహిరంగ సభకు సీఎం జగన్ చేరుకుంటారని తెలిపారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

- బీజేపీ నాయకుడు సీఎం రాజేష్


మాట్లాడుతున్న సీఎం రాజేష్

అచ్యుతాపురం, ఏప్రిల్ 11: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు సీఎం రాజేష్ అన్నారు. గురువారం మండలంలోని ఎంజేపురంలో ఎన్నికల ప్రచారం అనంతరం అచ్యుతాపురంలో ఒక కల్యాణ మండలంలో జరిగిన కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెలరోజులు చాలా కీలకమైనవని, ప్రతి ఇంటికి వెళ్లి అభ్యర్థుల గుర్తులను చెప్పాలని సూచించారు. మూడు పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేసి అభ్యర్థుల విజయానికి కృషిచేయాలన్నారు. సీఎం రమేశ్ గుర్తు కమలం, ఎమ్మెల్యే అభ్యర్థి విజయకుమార్ గుర్తు గాజుగ్లాసులపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో సుందరపు విజయకుమార్, పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు, రాజాన సన్యాసినాయుడు, లాలం భవానీ, రాజాన రమేష్ కుమార్, ధూళి రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

- బ్యాంక్ కరెన్సీ చెస్ట్‌లో తుపాకీతో కాల్చుకుని అఘాయిత్యం


శంకరరావు

సీతంపేట (విశాఖపట్నం), ఏప్రిల్ 11: స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) కానిస్టేబుల్ ఒకరు గురువారం తుపాకీ (సింగిల్ బెరల్ గన్)తో గుండెపై కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, సహ ఉద్యోగులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా వంగర మండలం కొట్టిస గ్రామానికి చెందిన పాలవలస శంకరరావు (35), భార్య శ్రావణి, ఇద్దరు పిల్లలు కుమారుడు కిశోర్, కుమార్తె జ్ఞానవితతో కలిసి మద్దిలపాలెం ప్రాంతంలోని పీతలవానిపాలెంలో నివాసం ఉంటున్నారు. శంకరరావు ఉద్యోగంలో అందరితో కలిసిమెలిసి ఉండేవారు. రోజూ మాదిరిగానే గురువారం ఉదయం ఐదు గంటలకు ద్వారకా నగర్‌లో గల ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు చెస్ట్‌లో సెంట్రీ డ్యూటీలో చేరారు. ఉదయం ఏడు గంటల సమయంలో తన చేతిలో ఉన్న ఎస్ఎల్ఆర్ వెపన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సంఘటనా స్థలానికి ఏసీపీ రాంబాబు, ద్వారకా స్టేషన్ సీఐ ఎస్.రమేష్, ఎస్ఐ ధర్మేంద్ర సిబ్బందితో చేరుకుని విచారణ చేపట్టారు. తమ బిడ్డకు ఎటువంటి సమస్యలు లేవని, భార్య శ్రావణి, పిల్లలతో ఎంతో అన్యోన్యంగా జీవితం సాగిస్తున్నట్టు శంకరరావు తల్లిదండ్రులు చెప్పారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శంకరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కరెన్సీ చెస్ట్‌లో గల సీసీ కెమెరాల్లో శంకరరావు ఏ విధంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడో ఫుటేజీ పరిశీలించారు. క్లూస్ టీమ్ ద్వారా నమూనాలను సేకరించారు.

వైసీపీ నేత నీటి చౌర్యం


వైసీపీ నేత వీధి కొళాయికి మోటారు బిగించి నీటి చౌర్యం చేస్తున్న దృశ్యం

రాంబిల్లి, ఏప్రిల్ 11 : మండలంలోని వాడనర్సాపురంలోని రామాలయం వద్ద వీధి కొళాయికి మోటారు ఏర్పాటు చేసి నీటి చౌర్యం చేస్తున్న వైసీపీ నేతపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినట్టు టీడీపీ మండల ఉపాధ్యక్షుడు సూరాడ అప్పలరాజు గురువారం విలేకరులకు తెలిపారు. కొన్ని నెలలుగా కొళాయికి మోటారు బిగించి నీటి చౌర్యం చేస్తున్నాడన్నారు. గ్రామంలో ప్రతి రోజు గంటపాటు కొళాయి నీరు వస్తుందని, వైసీపీ నేత మోటారు ద్వారా నీటిని తన ఇంటికి తరలిస్తుండడంతో మిగతా కుటుంబాలకు కొళాయి నీరు అందడం లేదన్నారు. ఈ విషయమై పాలకులు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు సూరాడ అప్పలరాజు తెలిపారు.

రుషికొండ తీరంలో బీటెక్ విద్యార్థి గల్లంతు

సాగర్‌నగర్(విశాఖపట్నం), ఏప్రిల్ 11 : రుషికొండ తీరంలో సముద్ర స్నానానికి దిగిన ఓ విద్యార్థి గల్లంతయ్యాడు. ఆరిలోవ సీఐ గోవిందరావు తెలిపిన వివరాలు ప్రకారం.. పలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న జి. సృజన్, జి.హర్ష, వై.వంశీ, ఎస్.సాయి వెంకట్, పి.ప్రణీత్, తేజస్ (20) రంజాన్ సెలవు కావడంతో గురువారం ఉదయం రుషికొండ బీచ్‌కు విహార యాత్రకు వచ్చారు. వారంతా సంపత్ వినాయక్ గుడి వద్ద ఉన్న ఎసెంట్ కళాశాలలో గతంలో ఇంటర్ కలిసి చదువుకున్నారు. ఈమేరకు బీచ్‌కు విహారానికి వచ్చిన వారు సరదాగా కాసేపు తీరంలో విహరించి, అనంతరం సాయిప్రియా రిసార్ట్స్ వెనుక ఉన్న తీరంలో స్నానాలకు దిగారు. కేరింతలు కొడుతూ... స్నానాలు చేస్తుండగా ఓ రాకాసి అల తాకిడికి తేజస్ సముద్రంలోకి కొట్టుకు పోయాడు. కళ్ల ఎదుటే మిత్రుడు కెరటాల్లో కొట్టుకుపోతుండడాన్ని చూసి మిగిలిన స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో పెద్దగా కేకలు వేయడంతో లైఫ్‌గార్డులు వచ్చారు. అప్పటికే తేజస్ సముద్రంలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఆరిలోవ సీఐ గోవిందరావు పర్యవేక్షణలో బ్లూకోర్టు పోలీసులు గల్లంతైన విద్యార్థి వివరాలు సేకరించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మెరైన్ పోలీసులు, లైఫ్‌గార్డులు గాలింపు చర్యలు చేపట్టారు. కంచరపాలెం ఊర్వశి జంక్షన్‌కు చెందిన తేజస్ (20) అమరావతి విట్ కళాశాలలో బీ టెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి కేఎల్ యూనివర్సిటీలో లెక్చరర్. తల్లి గృహిణి.

దువ్వాడ మీదుగా మరికొన్ని ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 11: వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని వయా దువ్వాడ మీదుగా వివిధ ప్రాంతాలకు మరికొన్ని ప్రత్యేక వారాంతపు రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

సూరత్-బ్రహ్మపూర్-సూరత్...

09069 నంబరు గల రైలు ఈనెల 17 నుంచి జూన్ 26 వరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సూరత్‌లో బయలుదేరి మర్నాడు రాత్రి 8.10 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం (తెల్లవారితే శుక్రవారం) 1.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరిగి ఈ రైలు ఈనెల 19 నుంచి జూన్ 28 వరకు ప్రతి శుక్రవారం తెల్లవారుజాము 3.30 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి అదేరోజు ఉదయం 8.20 గంటలకు దువ్వాడ, మర్నాడు మధ్యాహ్నం 1.45 గంటలకు సూరత్ చేరుతుంది.

నాగర్‌కోయిల్-డిబ్రుగర్-నాగర్‌కోయిల్

06103 నంబరు గల రైలు ఈనెల 12 నుంచి మే 24 వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 5.25 గంటలకు నాగర్‌కోయిల్‌లో బయలుదేరి మర్నాడు రాత్రి 11.18 గంటలకు దువ్వాడ, సోమవారం రాత్రి 8.50 గంటలకు డిబ్రుగర్ చేరుతుంది. తిరిగి ఈనెల 17 నుంచి మే 29 వరకు ప్రతి బుధవారం రాత్రి 7.55 గంటలకు డిబ్రుగర్‌లో బయలుదేరి మూ డోరోజు (శుక్రవారం) సా యంత్రం 4.28 గంటలకు దువ్వాడ, ఆదివారం రాత్రి 9.30 గంటలకు నాగర్‌కోయిల్ చేరుతుంది. 06105 నంబరు గల రైలు ఈనెల 19 నుంచి మే 31 వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 5.45 గంటలకు నాగర్‌కోయిల్‌లో బయలుదేరి మర్నాడు అర్ధరాత్రి 11.18 గంటలకు దువ్వాడ, సోమవారం రాత్రి 8.50 గంటలకు డిబ్రుగర్ చేరుతుంది. తిరిగి రైలు ఈనెల 24 నుంచి జూన్ 5 వరకు ప్రతి బుధవారం రాత్రి 7.55 గంటలకు డిబ్రుగర్‌లో బయలుదేరి మూడో రోజు (శుక్రవారం) సాయంత్రం 4.28 గంటలకు దువ్వాడ, శనివారం రాత్రి 9.30 గంటలకు నాగర్‌కోయిల్ చేరుతుంది.

ఎస్ఎంవీ బెంగళూరు-ఖరగ్‌పూర్-ఎస్ఎంవీ బెంగళూరు

06507 నంబరు గల రైలు ఈనెల 12 నుంచి మే 17 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3.50 గంటలకు బెంగళూరులో ఎస్ఎంవీ బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 12.00 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం తెల్లవారుజాము 2.00 గంటలకు ఖరగ్‌పూర్ చేరుతుంది. తిరిగి ఈనెల 15 నుంచి మే 20 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 2.00 గంటలకు ఖరగ్‌పూర్‌లో బయలుదేరి మర్నాడు తెల్లవారుజాము 2.38 గంటలకు దువ్వాడ, రాత్రి 7.50 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది.

చికెన్ ధరలు



బ్యాగ్	రూ.లలో
రైతు ధర	122.00
లైవ్ ధర	142.00
విత్ స్కిన్	264.00
స్కిన్ లెస్	274.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	408
విజయనగరం	412
శ్రీకాకుళం	412

వైసీపీ నుంచి బీజేపీలో 100 మంది చేరిక



బీజేపీలోకి చేరిన కార్యకర్తలతో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

కొత్తూరు, ఏప్రిల్ 11 : అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గాని కి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు 100 మంది గురువారం అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సమక్షంలో బీజేపీలో చేరారు. వారందరికీ సీఎం రమేశ్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

శారదా పరమేశ్వరిగా లలితాంబిక అమ్మవారు



శారదా పరమేశ్వరిగా దర్శనమిచ్చిన లలితాంబిక అమ్మవారు

సబ్బవరం, ఏప్రిల్ 11: మండలంలోని దేవీపురంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సహస్రాక్షి రాజరాజేశ్వరీ దేవి పీఠంలో లలితాంబిక అమ్మవారు గురువారం భక్తులకు శారదా పరమేశ్వరి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో యోగాశాలలో లలితాంబిక హోమం, పంచదశి మంత్ర జపం, అభిషేకం, శోడషోపచార పూజ, అనంతరం కళావాహన, సాయంత్రం లక్ష కుంకు మార్చన నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో శ్రీవిద్యాట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

మండలంలో వైసీపీ ఎన్నికల ప్రచారం

కోటవురట్ల, ఏప్రిల్ 11: మండలంలోని రామచంద్రపాలెం, జీసన్యాసిరాజుపాలెంలో వైసీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆయన వివరించారు.కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ చైర్మన్ డీవీ సూర్యనారాయణరాజు, సాగి సీతబాబు (దత్తుడు), మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోనవానిపాలెం వద్ద వాహనాల తనిఖీలు

ఎస్. రాయవరం, ఏప్రిల్ 11: మండలంలోని కోనవానిపాలెం వద్ద జాతీయ రహదారిపై గురువారం ఎస్ఐ విభీషణరావు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలను నిర్వహించారు. ఎన్నికల నిబంధనల్లో భాగంగా పలు వాహనాలను తనిఖీ చేసినట్టు ఆయన చెప్పారు.

వైసీపీని మరోసారి గెలిపించండి

పరవాడ, ఏప్రిల్ 11 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. మండలంలోని ముత్యాలమ్మపాలెంలో గురువారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, బొంది అచ్చిబాబు, అన్నంరెడ్డి అజయ్‌రాజ్ పాల్గొన్నారు.

మృత్యు శకటం



లారీ వెనుక చక్రాల కింద ముగ్గురు

... 5వ పేజీ తరువాయి

బంధువులు ప్రమాద స్థలంలో రహదారిపై బైఠాయించారు. ముగ్గురు ప్రాణాలను పొట్టనబెట్టుకున్న డ్రైవర్‌తో పాటు లారీ యజమానిని శిక్షించాలని డిమాండ్ చేశారు. వారికి ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. భారీగా వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో పడవాడ డీఎస్పీ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎన్నివిధాలా ప్రయత్నించినా ఆందోళనకారులు వెనక్కి తగ్గకపోవడంతో ట్రాఫిక్‌ను మళ్లించారు. లారీ యజమానికి సీఐ బుచ్చిరాజు ఫోన్ చేసి అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌కు రావాలని, తప్పనిసరిగా మృతుల కుటుంబీకులతో మాట్లాడాలని ఆదేశించారు. అందుకు లారీ యజమాని అంగీకరించడంతో సాయంత్రం ఐదున్నరకు మృతుల బంధువులు ఆందోళనను విరమించారు.

విద్యుత్ షాక్

... 5వ పేజీ తరువాయి

సమస్య తలెత్తుతోందని ఆయన వెల్లడించారు.

భారీగా పెరిగిన భారం

గడిచిన ఐదేళ్లలో వినియోగదారులపై విద్యుత్ భారం భారీగా పెరిగింది. నాడు రూ.250 విద్యుత్ బిల్లు చెల్లించినవాళ్లు...నేడు రూ.400 నుంచి రూ.550 వరకు కడుతున్నారు. గతంలో రూ.450 విద్యుత్ బిల్లు చెల్లించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జగదీష్...గడిచిన కొన్నాళ్లుగా రూ.750 వరకు చెల్లిస్తున్నారు. ఇళ్లకే కాకుండా చిన్న చిన్న దుకాణాల నిర్వహణదారులకు కూడా విద్యుత్ బిల్లులు షాక్ ఇస్తున్నాయి. గతంలో కిరాణా దుకాణానికి విద్యుత్ బిల్లు రూ.1200 వచ్చేదని, గడిచిన కొన్నాళ్లుగా రూ.2 వేలు దాటుతోందని విశాఖ హెచ్‌బీ కాలనీలో షాపు నిర్వహిస్తున్న శివయ్య పేర్కొన్నారు. గత నెలలో రూ.3,300 బిల్లు చెల్లించినట్టు ఆయన పేర్కొన్నారు. ఇక, ఈ వేసవిలో వచ్చే బిల్లులు తలుచుకుంటే భయమేస్తోందన్నారు. ఏదిఏమైనా వైసీపీ ప్రభుత్వం సాధారణ, మధ్య తరగతి ప్రజలపై విద్యుత్ చార్జీల రూపేణా మోయలేని భారం మోపిందని పలువురు పేర్కొంటున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 11 : రంజాన్ పండుగను పట్టణంలోని ముస్లిం సోదరులు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ముస్లింలు తమ కుటుంబసభ్యులతో కలిసి శారదానది ఒడ్డున గల ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనకాపల్లి జామియా మసీదు ఆధ్వర్యంలో రంజాన్ 30 రోజులు ఉపవాసం ఆచరించి నమాజ్ చేశారు. ఈ ప్రార్థనల్లో జామియా మసీదు అధ్యక్షుడు పీఎస్ఎస్ హుస్సేన్, దావూద్ ఆలీ, జిలానీ, ఉమర్, బడాబాబు, బాషా, మదీనా తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో.. స్థానిక శారదానగర్ ఇస్లాంపేట మదీనా మసీదులో గురువారం రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులంతా ఉదయం మసీదుకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎస్ఎస్ఎస్, కేజీఎస్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

కశింకోటలో.. స్థానిక ఈద్గా మసీదులో గురువారం రంజాన్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే.బాబర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు ఎస్. రహమతుల్లా, కార్యదర్శి ఎంఎం.అలీ, జాయింట్ కార్యదర్శి ఎం. రబ్బాని, సఫీ రషీద్ ఖాన్ పాల్గొన్నారు.

తుమ్మపాలలో.. స్థానిక మెయిన్‌రోడ్డులో గల మసీదులో రంజాన్ ప్రార్థనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు హాజరై ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం మెయిన్ రోడ్డులో రాకపోకలు సాగించే వాహనదారులకు చల్లని మజ్జిగను అందజేశారు.

పరవాడలో.. మండలంలో గురువారం రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రావాడ పంచాయతీ పరిధిలోని గొల్లగుంట, పరవాడ, సింహాద్రి ఎన్టీపీసీ సమీపంలో గల మసీదుల్లో ముస్లిం సోదరులు రంజాన్ ప్రార్థనలు చేశారు. కార్యక్రమాల్లో షేక్ మదీనా, షేక్ ఖలీల్, ఉస్మాన్ అలీ, శుభాన్‌అలీ, మిస్కిన్ అలీ, అబ్దుల్ రెహ్మాన్, షేక్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. మండలంలోని పెదబోదిగల్లం, చినబోదిగల్లం, రామకృష్ణాపురం, పెదదొడ్డిగల్లు, రామకృష్ణాపురం, అప్పలపాయకరావుపేట తదితర ముస్లిం గ్రామాల్లో గురువారం ముస్లిం సోదరులు రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ గ్రామాల్లో ముస్లింలంతా ఊరేగింపు చేపట్టారు. అనంతరం దర్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పాయకరావుపేటలో.. పట్టణంలో ముస్లిం సోదరులు రంజాన్ పండుగను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించిన ముస్లిం సోదరులంతా స్థానిక మసీదుకు చేరుకుని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. తమ స్థోమతకు తగినట్టుగా పేదలకు దానం చేశారు. పట్టణంలో ముస్లింలు, హిందువులు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుని ఆనందోత్సాహాలతో గడిపారు.



నక్కపల్లి: పెదబోదిగల్లంలో రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అచ్యుతాపురంలో.. పట్టణంలో రంజాన్ వేడుకలను గురువారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మార్టూరు రోడ్డులోనిగౌస్ మొహిద్దీన్ మసీదులో గురువారం ఉదయం నుంచి ప్రార్థనలు చేశారు. మత పెద్దలు, కమిటీ సభ్యులు ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కోటవురట్లలో.. మండల కేంద్రంలో ముస్లిం సోదరులు గురువారం రంజాన్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక మక్కా మసీదు, సంతబయిల మసీదు, లింగాపురం, టీకేపల్లి గ్రామాల్లో ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరిరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ముస్లిం మత పెద్దలు సూల్తాన్, ఖాసీం, ఇస్మాయిల్, అబ్దులా, అలీ మాట్లాడుతూ నెలరోజులపాటు ఆచరించిన ఉపవాస దీక్షలు నేటితో విరమించినట్టు ప్రకటించారు.

ఎలమంచిలిలో.. పట్టణంలో గురువారం రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ముస్లిం సోదరులంతా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం పేదలకు దాన ధర్మాలు చేశారు. రేగుపాలెంలో ముస్లిం సోదరులంతా రంజాన్ వేడుకలను సంప్రదాయ రీతిలో జరుపుకున్నారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ముస్లిం సోదరులు రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొరుప్రోలు, చెల్లాపురం, ఎస్. రాయవరం, వమ్మవరం, సీతారామపురం గ్రామాల్లో ముస్లింలు నమాజ్ చేశారు. చెల్లాపురంలో విశ్రాంతి ఉపాధ్యాయుడు జాఫర్, ముస్లీం మత పెద్దలను పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, సెక్రటరీ శ్రీనివాస్‌లు సన్మానించారు. కార్యక్రమంలో పీఆటీయూ నాయకులు రాధాకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.



అనకాపల్లి టౌన్: శారదానది ఒడ్డున ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



ఎలమంచిలిలో ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు

జ్యోతిరావు పూలేకు ఘన నివాళులు



అనకాపల్లి టౌన్: టీడీపీ జిల్లా కార్యాలయంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాగజగదీశ్వరరావు



పాయకరావుపేట: జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళిఅర్పిస్తున్న జనసేన నాయకుడు తోట నగేశ్, తదితరులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 11: తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కేవీవీఏ నారాయణరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, కొణతాల వెంకటరావు, బోడి వెంకటరావు, పొలిమేర నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే లక్ష్మీనారాయణనగర్‌లో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మొల్లి రమణబాబు జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పెదపాటి కళ్యాణి, వేగి దొరబాబు, వైశ్రీనివాసరావు, వియ్యపు శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

తుమ్మపాలలో.. పట్టణంలోని నెహ్రూచౌక్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని గవరపాలెం గురుకుల పాఠశాలలో జ్యోతిరావు పూలే జయంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జ్యోతిరావుపూలే బాల్య వివాహాలను వ్యతిరేకించి వితంతువుకు పునర్ వివాహానికి నాంది పలికిన గొప్ప వ్యక్తి అని అన్నారు. కార్యక్రమాల్లో సీపీఐ నాయకులు కోరిబిల్లి శంకరరావు, నరాలశెట్టి సత్యనారాయణ, విత్తనాల పోతురాజు, వీరుయాదవ్, గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్, ఉపాధ్యాయులు సుహాసిని, మోతిభాయి, మదన్‌మోహన్, మహేంద్రనాథ్ పట్నాయక్ పాల్గొన్నారు.

కశింకోటలో.. మండలంలోని సోమవరం గ్రామంలో జ్యోతిరావు పూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికిఇ తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నైనంశెట్టి రమణారావు, రమేష్, దుర్గ నాయుడు, నూకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో.. స్థానిక భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, కన్వీనర్ నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



పరవాడ: జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, తదితరులు

పరవాడలో.. మండల కేంద్రంలోని గొర్లివానిపాలెం బీసీ కాలనీలో గురువారం జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతిరావు పూలే చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎ.వరలక్ష్మి, సీహెచ్. వరహాలమ్మ, ఎ.అన్నపూర్ణ, పుష్ప, అనిత, లక్ష్మి పాల్గొన్నారు.

పాయకరావుపేటలో.. సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు గురువారం పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి జనసేన పార్టీ నాయకులు తోట నగేశ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఇంజరపు సూరిబాబు, ఐఎన్.మూర్తి, రాజా రమేశ్, కువల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో.. పట్టణంలో గురువారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలోమహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మారిశెట్టి వెంకట అప్పారావు, ఆర్. శంకరరావు, రామ్ కుమార్, రొంగల రాము, కె.సోమునాయుడు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని దార్లపూడిలో వ్యవసాయ కార్మిక సంఘం, డీవైఎఫ్ఐ దళిత సంఘాల ఆధ్వర్యంలో గురువారం జ్యోతీరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ, డీవైఎఫ్ఐ నాయకుడు మామిడి నానాజీ తదితరులు జ్యోతీరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అచ్యుతాపురంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



నెహ్రూచౌక్‌లో జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నీరుగారిన లక్ష్యం!

... 5వ పేజీ తరువాయి

నెలాఖరు నాటికి పనులు పూర్తవుతాయని అంటున్నారు.

పట్టణంలో ట్యాంకర్లతో నీటి సరఫరా

అగనంపూడి నుంచి అనకాపల్లికి పైపులైన్ పనులు పూర్తి కాకపోవడంతో పట్టణ ప్రజలకు సరిపడా తాగునీరు సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంటోంది. ప్రతి వేసవిలోనూ తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. అనకాపల్లి పట్టణంతో పాటు విలీన గ్రామాల్లో సుమారు 1.5 లక్షల మంది జనాభా ఉన్నారు. ప్రతి ఒక్కరికి సుమారు రోజుకు 120 లీటర్లు తాగునీరు అందించాల్సి ఉంటుంది. అనకాపల్లి జిల్లా కేంద్రంగా మారడంతో నీటి వినియోగం మరింతగా పెరిగింది. కేఎస్ఆర్ పేటలో రక్షిత నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఇంజనీర్లు గత వారం రోజులుగా రక్షిత నీరు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే రాజుపాలెం, సాలాపువానిపాలెం, కొప్పాక పంచాయతీల పరిధిలో సిరసపల్లి, సాలాపువానిపాలెం, కొండకొప్పాక, కొత్తూరు, వల్లూరు, రాజుపాలెం, విలీన గ్రామాల్లోనూ తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. కాంట్రాక్టరుకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలిసింది. కాంట్రాక్టరు ఇప్పటికే రూ.18 కోట్ల విలువైన పనులు పూర్తి చేస్తే, కేవలం రూ.12 కోట్లు మాత్రమే బిల్లులు చెల్లించినట్టు తెలిసింది.

ప్రారంభంకాని స్టోరేజ ట్యాంకుల నిర్మాణం

లక్ష్మీదేవిపేట, గవరపాలెంలో 10 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం గల స్టోరేజీ ట్యాంకర్లను సుమారు రూ.6 కోట్ల అంచనాలతో నిర్మించాలని ప్రతిపాదనలు పంపారు. అగనంపూడి పైపులైన్ పనులు పూర్తిచేసి అక్కడ నుంచి తరలించిన నీటిని తుమ్మపాలతో పాటు ఈ రెండు ట్యాంకుల్లో సురక్షిత నీటిని నిల్వచేసి ప్రజలకు సరఫరా చేయాల్సి ఉండగా, ఈ పనులు ఇప్పటికీ మొదలు కాలేదు. ట్యాంకుల నిర్మాణ పనుల కోసం జీవీఎంసీ ఇంజనీర్లు ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. గతంలో జీవీఎంసీ పరిధిలో చేపట్టిన వివిధ పనులకు ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వల్ల కాంట్రాక్టర్లు ట్యాంకుల నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రాలేదని తెలిసింది. ఎట్టకేలకు జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు అనకాపల్లిలో రెండు నీటి ట్యాంకుల నిర్మాణానికి నాలుగోసారి పిలిచిన టెండర్లకు గత ఏడాది డిసెంబరు నెలలో ఒక కాంట్రాక్టరు పనులు దక్కించుకున్నారు. అయితే ఆయన టెండర్ దక్కించుకున్నా ఇంకా ట్యాంకుల నిర్మాణ పనులు మొదలు పెట్టలేదు. ఎన్నికల అనంతరం ఈ పనులు మొదలవుతాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ట్యాంకుల నిర్మాణం త్వరితగతిన చేపట్టడంతో పాటు తాగునీటి సరఫరా పైపులైన్ పనులు పూర్తి చేయాలని అనకాపల్లి పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రెండు గ్రామాల్లో టీడీపీ ఎన్నికల ప్రచారం

- సీఎం రమేశ్ భార్య శ్రీదేవి, అనితలకు హారతులు



ఎన్నికల ప్రచారం చేస్తున్న అనిత, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ భార్య శ్రీదేవి

కోటవురట్ల, ఏప్రిల్11: మండలంలోని కె.వెంకటాపురం, లింగాపురాల్లో గురువారం పాయకరావుపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ భార్య శ్రీదేవి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వారిపై పూలవర్షం కురిపించారు. అడుగడుగునా మంగళ హారతులు పట్టారు. ఈ సందర్భంగా అనిత, శ్రీదేవి ఇంటింటా వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, వేచలపు జనార్దన్, తిరుమలరావు, సింగంపల్లి శ్రీనివాసరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పెట్ల లింగంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన ఉష్ణోగ్రతలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 11 : పట్టణంలో గురువారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. బుధవారం 37.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా గురువారం 36.8 డిగ్రీలకు తగ్గింది. ఉదయం నుంచి వాతావరణం చల్లబడడంతో మధ్యాహ్నం ఉష్ణోగ్రత తగ్గింది. గత నాలుగు రోజులుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు గురువారం ఉపశమనం పొందారు.

అగ్నిగుండం తొక్కిన నూకాంబిక భక్తులు



ఇరుముడితో అగ్నిగుండం తొక్కుతున్న భక్తుడు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 11 : నూకాంబిక కొత్త అమావాస్య జాతర సందర్భంగా అమ్మవారి మాలధారణ భక్తులు బుధవారం రాత్రి అగ్నిగుండం తొక్కారు. మాలధారణ భక్తుల దీక్ష పూర్తి కావడంతో ఇరుముడి తలపై పెట్టుకుని పట్టణంలో ఊరేగింపుగా వెళ్లి తాకాశీవీధిలోని నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద అగ్నిగుండం తొక్కారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తాకాశి రాజేష్, తాకాశి కన్నబాబు, తాకాశి చందు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

పరవాడ, ఏప్రిల్ 11 : స్థానిక సినిమాహాల్ జంక్షన్‌లో బొద్దపు గంగునాయుడు జ్ఞాపకార్థం గురువారం మజ్జిగ చలివేంద్రాన్ని ఆటో యూనియన్ ప్రతినిధి బొద్దపు అయ్యబాబు ప్రారంభించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పాదచారులు, వాహనదారులకు ఉపయోగకరంగా ఉండే విధంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు బెజవాడ పెంటునాయుడు, గంటిరెడ్డి, గణేష్, వద్దాది రమేష్, బి. గోపాల్‌రెడ్డి, ఎ. శివ, రాంబాబు పాల్గొన్నారు.

శ్రీరాంపురంలో జయహో బీసీ

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్11: రాష్ట్రంలో బీసీలకు నిజమైన రాజకీయాధికారం ఇచ్చింది టీడీపీయే అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. మండలంలోని శ్రీరాంపురంలో గురువారం జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం హయాంలో బీసీలకు అభివృద్ధి పథకాలు అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గింజాల లక్ష్మణరావు, బొంది కాశీవిశ్వనాథ్,చింతకాయల రాంబాబు, గోసల కృష్ణ, అశోకచక్రవర్తి, కంకిపాటి వెంకటేశ్వరరావు, చింతలపు ప్రదీప్, బీజేపీ నాయకుడు గాంధీ పాల్గొన్నారు.

ధారపాలెంలో టీడీపీ ఎన్నికల ప్రచారం

రాంబిల్లి, ఏప్రిల్ 11 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు వి.దిన్‌బాబు కోరారు. గురువారం ఆయన జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పంచదార్లశివారు ధారపాలెంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్‌డీఏ బలపరచిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు గాజుగ్లాసు గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ప్రసాద్, గోవింద్, చిన్న, ధర్మరాజు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

30 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన నెల్లిపూడికి చెందిన కుటుంబాలు

నక్కపల్లి, ఏప్రిల్ 11: మండలంలోని నెల్లిపూడి గ్రామానికి చెందిన 30 కుటుంబాల వారు గురువారం సాయంత్రం టీడీపీలోకి చేరారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనిత ఇంటి వద్ద వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, గింజాల లక్ష్మణరావు, కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, గింజాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యనారాయణస్వామి జయంతి

రాంబిల్లి, ఏప్రిల్ 11 : మండలంలోని వాడనర్సాపురంలో గురువారం మత్స్యనారాయణస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యనారాయణస్వామి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వాడనర్సాపురం మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య, జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం మాజీ చైర్మన్ ఉమిడి పైడిరాజు, మత్స్యకార నేతలు సూరాడ నూకరాజు, చోడిపిల్లి మంగరాజు, చెల్లూరి కోదండరావు, ఉమ్మిడి భాస్కరరావు పాల్గొన్నారు.

సజావు ఎన్నికలకు గ్రామస్థులు సహకరించాలి : సీఐ



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వినోద్‌బాబు

కశింకోట, ఏప్రిల్ 11: ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు గ్రామస్థులంతా సహకరించాలని సీఐ వినోద్‌బాబు కోరారు. గురువారం నర్సింగబిల్లిలో ఎన్నికల నియమావళిపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి వివాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం, డబ్బు వంటి వాటిని పంపిణీ చేయడం వంటి చట్టరీత్యా నేరమన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ రమేష్‌బాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గం

అక్రమ కలపకు రూ.21,626 ఫైన్

▸▸ 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

మాకవరపాలెం, ఏప్రిల్ 11: మండలంలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను స్వాధీనం చేసుకుని ఫైన్ వేశామని ఎలమంచిలి ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజర్ అనిల్‌కుమార్ తెలిపారు. రామన్నపాలెంలో 'కలప అక్రమ నిల్వ' అన్న శీర్షికన ఈ నెల 10వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు రామన్నపాలెం ఏలేరు కాలువకు ఆనుకుని తోటలో నిల్వ ఉన్న కలపను స్వాధీనం చేసుకుని, రూ.21,626 ఫైన్ వేశామని ఫారెస్ట్ రేంజర్ తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం బాధ్యులపై కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. అలాగే కలప అక్రమంగా రావాణా చేసినా, నిల్వ చేసినా కేసులు నమోదు చేస్తామని రేంజర్ హెచ్చరించారు.

ఆరిలోవ అటవీ ప్రాంతానికి నిప్పు



ఆరిలోవ అటవీ ప్రాంతంలో చెలరేగుతున్న నిప్పు

గొలుగొండ, ఏప్రిల్ 11: ఆరిలోవ అటవీ ప్రాంతానికి నిప్పంటుకుంది. గురువారం రాత్రి ఆరిలోవ రోడ్డుకు ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలో చెట్లకు నిప్పంటుకుని మంటలు చేలరేగుతున్నాయి. దీంతో రోడ్డు మార్గంలో రాకపోకలకు మంటల వేడిమికి తట్టుకోలేక కొంత సమయం దూరంగా వాహన చోదకులు ప్రయాణాలు సాగించారు. అగ్నిమాపక వాహనానికి స్థానికులు సమాచారం అందించారు. దీంతో అటవీ, అగ్నిమాపక శాఖాధికారుల వచ్చి మంటలను అదుపు చేశారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి సహకరించండి

గొలుగొండ, ఏప్రిల్ 11: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ కృష్ణారావు కోరారు. మండలంలో రావణాపల్లి గ్రామంలోని చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గొడవలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. సారా విక్రయించిన వారిపై ఫిర్యాదు చేయాలని సూచించారు.

హామీలు నెరవేర్చని జగన్‌ను సాగనంపండి

▸▸ నర్సీపట్నం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడు

నాతవరం, ఏప్రిల్ 11: పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని, వచ్చే ఎన్నికలలో జగన్‌ను ఇంటికి సాగనంపాలని నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కోరారు. మండలంలోని పి.జగ్గంపేట గ్రామంలో గురువారం రాత్రి ఎన్నికల శంఖారావంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఆరాచకాలను భరించలేక ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా టీడీపీలోకి వస్తున్నారని పేర్కొన్నారు. 99 హమీలను అమలు చేశామని జగన్‌మోహన్‌రెడ్డి చెబుతూ, మరలా ప్రజలను మోసం చేయడానికి చూస్తున్నారన్నారు సీపీఎస్ రద్దు, ప్రత్యేకహోదా, రైల్వే జోన్ ఏర్పాటు తదితర హమీలను ఎక్కడ నెరవేర్చడాని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. టీడీపీ హయంలో పి.జగ్గంపేటలో ఆరు కోట్లతో అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. అంతకుముందు వైసీపీకి చెందిన పి.జగ్గంపేట మాజీసర్పంచ్ అంకంరెడ్డి నానిబాబుతో సహా 30 మంది వైసీపీ కార్యకర్తలు అయ్యన్నపాత్రుడు సమక్షంలో టీడీపీ తీర్థం



అయ్యన్న సమక్షంలో టీడీపీలోకి చేరిన నానిబాబు, వైసీపీ కార్యకర్తలు

పుచ్చుకున్నారు. వైసీపీకి చెందిన అంకంరెడ్డి గిరిబాబు, డొక్కా మునిలి తదితరులు టీడీపీ పార్టీలో చేరినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యులు కరక సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, టీడీపీ నాయకులు అడిగర్ల భాస్కరరావు, చింతకాయల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

నర్సీపట్నం, ఏప్రిల్ 11: నర్సీపట్నం చుట్టు పక్కల ప్రాంతాలలో ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం మసీదులలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి ప్రార్థనా మందిరాలలో ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. జామియా మసీదులో అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు,



కృష్ణదేవిపేట మసీదులో సమాజ్ చేస్తున్న ముస్లింలు



జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

అనంతరం పేదలకు దాన ధర్మాలు చేశారు.

కృష్ణదేవి పేటలో...

కృష్ణదేవిపేట: గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో గురువారం రంజాన్ పండగ ఘనంగా నిర్వహించారు. కొయ్యూరు, గొలుగొండ మండలాలకు చెందిన ముస్లింలు మసీదులో సమాజ్ చేవారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు రంజాన్ విశిష్ట తనులు వివరించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, సంఘ పాల్గొన్నారు.

నీరుగారిన లక్ష్యం!

... 5వ పేజీ తరువాయి

నెలాఖరు నాటికి పనులు పూర్తవుతాయని అంటున్నారు.

పట్టణంలో ట్యాంకర్లతో నీటి సరఫరా

అగనంపూడి నుంచి అనకాపల్లికి పైపులైన్ పనులు పూర్తి కాకపోవడంతో పట్టణ ప్రజలకు సరిపడా తాగునీరు సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంటోంది. ప్రతి వేసవిలోనూ తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. అనకాపల్లి పట్టణంతో పాటు విలీన గ్రామాల్లో సుమారు 1.5 లక్షల మంది జనాభా ఉన్నారు. ప్రతి ఒక్కరికి సుమారు రోజుకు 120 లీటర్లు తాగునీరు అందించాల్సి ఉంటుంది. అనకాపల్లి జిల్లా కేంద్రంగా మారడంతో నీటి వినియోగం మరింతగా పెరిగింది. కేఎస్ఆర్ పేటలో రక్షిత నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఇంజనీర్లు గత వారం రోజులుగా రక్షిత నీరు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే రాజుపాలెం, సాలాపువానిపాలెం, కొప్పాక పంచాయతీల పరిధిలో సిరసపల్లి, సాలాపువానిపాలెం, కొండకొప్పాక, కొత్తూరు, వల్లూరు, రాజుపాలెం, విలీన గ్రామాల్లోనూ తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. కాంట్రాక్టరుకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలిసింది. కాంట్రాక్టరు ఇప్పటికే రూ.18 కోట్ల విలువైన పనులు పూర్తి చేస్తే, కేవలం రూ.12 కోట్లు బిల్లులు చెల్లించినట్టు తెలిసింది.

ప్రారంభంకాని స్టోరేజి ట్యాంకుల నిర్మాణం

లక్ష్మీదేవిపేట, గవరపాలెంలో 10 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం గల స్టోరేజీ ట్యాంకర్లను సుమారు రూ.6 కోట్ల అంచనాలతో నిర్మించాలని ప్రతిపాదనలు పంపారు. అగనంపూడి పైపులైన్ పనులు పూర్తిచేసి అక్కడ నుంచి తరలించిన నీటిని తుమ్మపాలతో పాటు ఈ రెండు ట్యాంకుల్లో సురక్షిత నీటిని నిల్వచేసి ప్రజలకు సరఫరా చేయాల్సి ఉండగా, ఈ పనులు ఇప్పటికీ మొదలు కాలేదు. ట్యాంకుల నిర్మాణ పనుల కోసం జీవీఎంసీ ఇంజినీర్లు ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. గతంలో జీవీఎంసీ పరిధిలో చేపట్టిన వివిధ పనులకు ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వల్ల కాంట్రాక్టర్లు ట్యాంకుల నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రాలేదని తెలిసింది. ఎట్టకేలకు జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు అనకాపల్లిలో రెండు నీటి ట్యాంకుల నిర్మాణానికి నాలుగోసారి పిలిచిన టెండర్లకు గత ఏడాది డిసెంబరు నెలలో ఒక కాంట్రాక్టరు పనులు దక్కించుకున్నారు. అయితే ఆయన టెండర్ దక్కించుకున్నా ఇంకా ట్యాంకుల నిర్మాణ పనులు మొదలు పెట్టలేదు. ఎన్నికల అనంతరం ఈ పనులు మొదలవుతాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ట్యాంకుల నిర్మాణం త్వరితగతిన చేపట్టడంతో పాటు తాగునీటి సరఫరా పైపులైన్ పనులు పూర్తి చేయాలని అనకాపల్లి పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మృత్యు శకటం

... 5వ పేజీ తరువాయి

బంధువులు ప్రమాద స్థలంలో రహదారిపై బైఠాయించారు. ముగ్గురు ప్రాణాలను పొట్టనబెట్టుకున్న డ్రైవర్‌తో పాటు లారీ యజమానిని శిక్షించాలని డిమాండ్ చేశారు. వారికి ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. భారీగా వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో డీఎస్పీ సత్యనారాయణ వచ్చి అన్ని విధాలా ప్రయత్నించినా ఆందోళనకారులు వెనక్కి తగ్గకపోవడంతో ట్రాఫిక్‌ను మళ్లించారు. లారీ యజమానికి సీఐ బుచ్చిరాజు ఫోన్ చేసి అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌కు రావాలని, తప్పనిసరిగా మృతుల కుటుంబీకులతో మాట్లాడాలని ఆదేశించారు. అందుకు లారీ యజమాని అంగీకరించడంతో సాయంత్రం ఐదున్నరకు బంధువులు ఆందోళనను విరమించారు.



లారీ చక్రాల కింద మృతదేహాలు

విద్యుత్ షాక్

... 5వ పేజీ తరువాయి

సమస్య తలెత్తుతోందని ఆయన వెల్లడించారు.

భారీగా పెరిగిన భారం

గడిచిన ఐదేళ్లలో వినియోగదారులపై విద్యుత్ భారం భారీగా పెరిగింది. నాడు రూ.250 విద్యుత్ బిల్లు చెల్లించినవాళ్లు...నేడు రూ.400 నుంచి రూ.550 వరకు కడుతున్నారు. గతంలో రూ.450 విద్యుత్ బిల్లు చెల్లించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జగదీష్...గడిచిన కొన్నాళ్లుగా రూ.750 వరకు చెల్లిస్తున్నారు. ఇళ్లకే కాకుండా చిన్న చిన్న దుకాణాల నిర్వహణదారులకు కూడా విద్యుత్ బిల్లులు షాక్ ఇస్తున్నాయి.

గతంలో కిరాణా దుకాణానికి విద్యుత్ బిల్లు రూ.1200 వచ్చేదని, గడిచిన కొన్నాళ్లుగా రూ.2 వేలు దాటుతోందని విశాఖ హెచ్‌బీ కాలనీలో షాపు నిర్వహిస్తున్న శివయ్య పేర్కొన్నారు. గత నెలలో రూ.3,300 బిల్లు చెల్లించినట్టు ఆయన పేర్కొన్నారు. ఇక, ఈ వేసవిలో వచ్చే బిల్లులు తలుచుకుంటే భయమేస్తోం దన్నారు. ఏదిఏమైనా వైసీపీ ప్రభుత్వం సాధారణ, మధ్య తరగతి ప్రజలపై విద్యుత్ చార్జీల రూపేణా మోయలేని భారం మోపిందని పలువురు పేర్కొంటున్నారు.

చోడవరం నియోజకవర్గం

సస్య రక్షణతోనే ఆరోగ్యకర పంట దిగుబడులు

▸▸ కేవీకే కోఆర్డినేటర్ రాజ్‌కుమార్



గ్రూపు చర్చలో పాల్గొన్న రైతులు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 11: సమగ్రమైన సస్యరక్షణతోనే ఆరోగ్యకరమైన దిగుబడులను సాధించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం (కొండెంపూడి) కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ అన్నారు. ఆయన గురువారం పి.భీమవరంలో కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థినుల ఆధ్వర్యంలో జరిగిన రైతుల సామూహిక చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. సేంద్రియ సాగు పదతులపై అవగాహన కల్పించారు. రసాయనరహిత సాగు సాధనపై మాట్లాడారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కిషోర్ కుమార్, సర్పంచ్ పినపోలు రామానాయుడు, విద్యార్థినులు శశికళ, పూజిత, శ్రావణి, పల్లవి, నిఖిత, షారోన్, తేజస్విని, ప్రత్యూష పాల్గొన్నారు.

చంద్రబాబు రోడ్‌షో జయప్రదం చేయాలి

చోడవరం, ఏప్రిల్ 11: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 14న టీడీపీ నేత నారా చంద్రబాబునాయుడు రావికమతం మండలంలో రోడ్‌షో నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఈ రోడ్ షో విజయవంతంపై గురువారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం సాయంత్రం చంద్రబాబు పాల్గొననున్న రోడ్‌షోరే కార్యకర్తలంతా కలిసికట్టుగా తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు బత్తుల తాతయ్యబాబు, గూనూరు మల్లునాయుడు, గేదెల సత్యనారాయణ, పెదబాబు, మజ్జి గౌరీశంకర్, మత్సరాజు. బొడ్డేడ గంగాధర్ పాల్గొన్నారు.

నృసింహ గజపతినగరంలో తాగునీటి కష్టాలు

▸▸ ఐదు రోజుల నుంచి పనిచేయని రక్షిత పథకం

▸▸ పొలాల్లో బావుల నీటి తెచ్చుకుంటున్న గ్రామస్థులు

దేవరాపల్లి, ఏప్రిల్ 11: మండలంలోని నృసింహ గజపతినగరం రక్షిత పథకానికి సరఫరా చేసే మోటారు పనిచేయక గత ఐదు రోజులుగా తాగు నీటికి గ్రామస్తులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. కొన్నాళ్లుగా రెండు బోర్లు పని చేయడంలేదు. గ్రామమంతా ఈ రక్షిత పథకంపైనే ఆధార పడి ఉంది.ఇప్పుడు ఈ పథకం ట్యాంక్‌కు నీటి సరఫరా చేసే మోటారు మరమ్మతుకు గురి కావడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.వేసవి కావడంతో చుక్కనీటికి ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలో మరో రెండు బోర్లు పని చేస్తున్నా వాటి నీరు బాగోలేక పోవడంతో. మహిళలు పొలాల్లో ఉన్న బోర్లు నుంచి నీటినితెస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు.



నృసింహ గజపతినగరంలో పనిచేయని రక్షిత పథకం



మూలకు చేరిన బోరు

బడుగుల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

మాడుగుల, ఏప్రిల్ 11: మాడుగుల గాంధీపార్కు వద్ద వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాద, వైసీపీ నాయకులు జ్యోతిరావు పూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే సేవలను స్మరించుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రామధర్మజ, బొమ్మిశెట్టి శ్రీను, దేవరాపల్లి శ్రీను, యడ్ల కళావతి, విజయలక్ష్మి, పరమేశ్, సత్తిబాబు, భాస్కర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: సామాజిక కార్యకర్త, మేధావి, కుల వ్యతిరేక సామాజిక సంస్కర్త జ్యోతీరావ్ పూలే అని మాడుగుల టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం పూలే జయంతి పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్ సోదరుడు సురేశ్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు, బీసీ, ఎస్టీ, ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు నెక్కెళ్ల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వడ్డాదిలో సీతారామునికి ప్రత్యేక పూజలు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 11: వడ్డాదిలో సీతారామునికి నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా మూడో రోజు గురువారం అర్చకులు ఎం.కృష్ణశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల వారిని (పత్యేకంగా అలకరించారు. మహిళా భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు

చింతపండుకు తగ్గిన గిరాకీ

చీడికాడ, ఏప్రిల్ 11: మండలంలో కోనాం సంతలో ఈ వారం చింతపండు ధర తగ్గిపోవడంతో గిరిరైతులు ఆందోళన వ్యక్తంచేశారు. కోనాం పంచాయతీతోపాటు ఏజెన్సీకి చెందిన పాడేరు, హుకుంపేట, అనంతగిరి, పెద బయలు, మాడుగుల మండలాలతో పాటు మైదాన ప్రాంత గ్రామాల నుంచి గురువారం సంతకు చింతపండు అధికంగా వచ్చింది. ఉదయం 10గంటల వరకూ 40 కిలోల కావిడి రూ.2వేలు నుంచి రూ.2200లకు అమ్మకాలు జరగగా, ఉదయం 10 నుంచి ఒంటి వరకూ అదే కావిడి రూ.1400 నుంచి రూ.1800లకు ధర పడిపోయింది. గత వారం కిలో రూ. 60 నుంచి 65 ధర పలకగా ఈసారి రూ. 40నుంచి 50కు వి క్రయించాల్సి వచ్చింది.



కోనాం సంతలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న చింతపండు

మోదకొండమ్మ ఆలయం ఎదుట స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు



నిర్మాణ పనులు

మాడుగుల, ఏప్రిల్ 11: మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆల య సమీపంలో ఆలయ కమిటీ చర్యలు స్పీడ్ బేకర్‌ని ఏర్పాటు చేసింది. ఉత్తరాంధ్ర జిల్లాకు చెందిన ప్రజలు, భక్తులు మోదకొండమ్మ ఆలయానికి ఆది, మం గళవారాల్లో అదిక సంఖ్యలో వస్తుంటారు. ఈ నేపథ్యంలోఓ ఆలయం వద్ద భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో అటుగా వాహనాలుఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ముందుస్తు చర్యగా ఆలయం ఎదుట కూతవేటు దూరంలో స్పీడ్ బేకర్‌ని ఏర్పాటు చేశారు. ప్రయాణికులు గమనించేలా స్పీడ్ బేకర్‌పై రేడియం రంగులు వేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మాడుగుల నియోజకవర్గం




బేతపూడిలో తనిఖీలు చేస్తున్న ఎన్‌ఫోర్సుమెంట్ పోలీసు బృందాలు

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

దేవరాపల్లి, ఏప్రిల్ 11: మండలంలోని రైవాడ శివారు బేతపూడి, వాకపల్లిలో అనకాపల్లి అడిషినల్ ఎస్పీ స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో ఆదేశాల మేరకు, చోడవరం ఇన్‌స్పెక్టర్ బి.హెచ్.కిరణ్ ఆధ్వర్యంలో లిక్కర్, మాదక ద్రవ్యాలపై గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించి అనంతరం అవగాహన సమావేశం నిర్వహించారు. అనకాపల్లి, చోడవరం, కెకోటపాడు సర్కిల్ ఇనస్పెక్టర్లు, సిబ్బందితో అనధికార మద్యం, గంజాయి, నాటు సారా తయారీ నిరోధానానికి పరిసరాలను విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా ఎటువంటివి దొరకక పోవడంతో అనంతరం అవగాహన సమావేశం నిర్వహించారు. సారా తయారీ, గంజాయి రవాణాను ప్రోత్సహించిన చట్ట రీత్యా నేరమనివారు ఈసందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె.కోటపాడు సి.ఐ. స్వామినాయుడు, సిబ్బంది, రెండు గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి'



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

దేవరాపల్లి/ కె.కోటపాడు, ఏప్రిల్ 11: రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలను తరిమికొట్టాలని మాడుగుల టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండలంలోని కార్యకర్తలతో సమావేశం గురువారం జరిగింది. ఎంపీ అభ్యర్థి సీఎం. రమేశ్ సోదరుడు సురేశ్‌ను కార్యకర్తలు సత్కరించారు. కార్యకర్తలు చెరకాన సూర్యనారాయణ, పోతల పాత్రునాయుడు, చల్లానానాజీ, రామారావు, గొర్లి దేముళ్లు, అర్జునరావు, పెద్దాడ వెంకటరమణ, రెడ్డి బలరాం, బొడ్డు జగదీశ్వరరావు, కడిం నాగేశ్వరరావు, తమడాన ప్రసాద్, కిల్లిగోవింద బుజ్జి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి

దేవరాపల్లి మండలంలోని చింతపూడి, తామరబ్బ, పాత బొడ్డపాడుతోపాటు, కె.కోటపాడు మండలం చౌడువాడ గ్రామం నుంచి వైసీపీ నాయకులు, పైలా ప్రసాదరావు, సీఎం.సురేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఎస్సీ కాలనీకి చెందిన 25 కుటుంబాలు సర్పంచ్ ఎరుకునాయుడు ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

నేడు చీడికాడలో సీఎం రమేష్ సభ

చీడికాడ, ఏప్రిల్ 11: అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ముఖ్య అతిథిగా ఈనెల 12వ తేదీన జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని మాడుగుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు కోరారు. స్థానిక టీడీపీ మండల అధ్యక్షులు స్వగృహం ఆవరణలో గురువారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శుక్రవారం సాయంత్రం 6గంటలకు తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో సమావేశం జరుగుతుందన్నారు.

ఘనంగా రంజాన్

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 11: వడ్డాది మజీద్ నజ్రా అల్ జోహరే మసీద్‌లో గురువారం (ఈద్‌ఉల్ ఫితర్)రంజాన్ పండుగను ముస్లీం సోదరులు ఘనంగా నిర్వహించారు. మత గురువు షేక్ తాజుద్దీన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు అల్లాకు ప్రార్థనలు చేశారు. మసీదు నందు చిన్నా, పెద్దా లేదా లేకుండా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గురువా (అల్లా) చెప్పిన ఆచార హితవును అవలంబించాలని కోరారు. అనంతరం పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రోలుగుంట: రోలుగుంటలోని మసీదులో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ముస్లిం సోదరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రేమ, సోదర భావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమన్నారు. రంజాన్ మాసంలో 30 రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు చేసి అల్లా అనుగ్రహం పొందుతారని ఎస్‌కె సలీం తెలిపారు.

మాడుగుల: స్థానిక గాంధీ పార్కు సమీపంలోని జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరినొకరు రంజన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఇళ్లలో పలు రకాల వంటలను నిర్వహించి విందుభోజనాలు చేసి ఆనందంగా గడిపారు.



బుచ్చయ్యపేటలో ప్రార్థనల్లో ముస్లింలు

ప్రార్థనల్లో పాల్గొన్న సురేశ్‌నాయుడు

జామియా మసీదులో సయ్యద్ సర్థాన్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రార్థనల్లో టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు సురేశ్ నాయుడులు పాల్గొన్నారు. అనంతరం ముస్లింలకు స్వీట్స్ అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

ఈర్లె అనురాద పార్థన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, వైసీపీ నాయకులు, ముస్లింల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కాదర్‌వల్లీ, జమీల్, ఉపాధ్యక్షుడు నాగుర్ మీరా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రావికమతం: మండల కేంద్రంలో గురువారం రంజాన్ వేడుకలను జరిగాయి. ఈ సందర్భంగా ఈదు ముబారక్ జామియా మసీద్ గురువు మహమ్మద్ ఇమామ్ గుల్‌పరాజ్ ఆధ్వర్యంలో ముస్లింలు నమాజ్ చేశారు. అనంతరం ఒక్కరినొక్కరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌కె సుభాన్, చిన్న సాహెబ్, తదితరులు పాల్గొన్నారు..